క్లుప్తంగా

జములమ్మ ఆలయానికి విరాళాల వెల్లువ



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న జములమ్మ ఆలయానికి దాతలు విరాళాలు విరివిగా అందిస్తున్నారు. గవిని మల్లీశ్వరి శ్యాంసుందర్‌రెడ్డి రూ.3 లక్షలు, దండు అయ్యప్ప రూ.3 లక్షలు, శ్రీనివాస్‌రెడ్డి రూ.1 లక్ష, వెంకటేశ్వర్‌రావు రూ.20 వేలు, మాజీ ఎంపీపీ జయరాములుశెట్టి రూ.10 వేలు విరాళాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విరాళాలను అందించిన దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎం.లక్ష్మన్న, శ్యాంసుందర్‌రెడ్డి, డీలర్ వెంకటయ్య, తెలుగు పెద్దన్న, గోవు చంద్రన్న, గోపాల్, శ్రీనువాసులు తదితరులు ఉన్నారు.

సాయిబన్నను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ లో అనారోగ్యంతో బాధపడుతున్న దామరగిద్ద మండలం గడిమున్కన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయబన్నను మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్, కార్యకర్తలు సురేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


నేడు భూ భారతి చట్టంపై అవగాహన

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన భూ భారతి చట్టంపై శనివారం నూతన మండల కాంప్లెక్స్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలు హాజరవుతున్నారన్నారు. భూ సమస్యలు ఉన్న వారు, ఇతరులు ఎవరైనా భూ భారతి చట్టం గూర్చి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

మండల కేంద్రంలో సమ్మర్ క్యాంప్

మాగనూర్: వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నుంచి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు (ఆర్మీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపును మండలంలోని వివిధ గ్రామాల యువతీ, యువకులు, అదే విధంగా దేశ, రాష్ట్ర రక్షణశాఖ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపులో వాలీబాల్, 1600 మీటర్స్, 800 మీటర్స్, 400 మీటర్స్ లాంగ్ జంప్, హై జంప్‌తో పాటుగా వివిధ రకాల క్రీడలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. మాగనూర్ పీడీ రాకేష్‌శర్మ మాట్లాడుతూ.. మాగనూర్ మండలంలో మొదటి సారిగా నిర్వహిస్తు ఈ సమ్మర్ క్యాంపును విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరి సహాయ, సహకారాలు అవసరమని కోరారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ ఫోన్ నంబర్లు 9010096659, 9086271418 సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం



మరికల్: మండల కేంద్రానికి చెందిన క్రీడా శిక్షకులు వడ్ల బాల్‌రాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం పదో తరగతి స్నేహితులు, యువక మండలి సభ్యులు తమవంతుగా రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. తమతో పదో తరగతి చదువుకున్న స్నేహితుడు ఎంతో మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి వారి తలరాత మార్చిన ఆయన సేవలను ప్రస్తుతం కోల్పోవడం తమ గ్రామానికి తీరాన్ని లోటన్నారు. తమ స్నేహితుడి కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు అందరం కలిసి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం చేయడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, రవిగౌడ్, విజయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతుల్లో గుబులు



మందిపల్లిలో వరి ధాన్యం ఆరబెడుతున్న రైతులు

- ఉదయం ఎండలు.. సాయంత్రం ఈదురు గాలులు
- పొలాల్లో ధాన్యం రాశులు
- ఆందోళనలో అన్నదాతలు

ధన్వాడ: ఉదయం ఎండలు.. సాయంత్రం ఈదురు గాలులతో వరుణుడు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాడు. రోజురోజుకు వాతావరణంలో కనిపిస్తున్న మార్పుల వల్ల ఆకాశం మేఘావృతమై వర్ష సూచన కన్పించడం అన్నదాతలకు దఢ పుట్టిస్తోంది. కొన్ని చోట్ల వర్షాలు పడుతుండంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు శాయశక్తుల ప్రయత్నాలు చేస్తున్నారు. ధన్వాడ మండల పరిధిలో వరిపంట చేతికొచ్చింది. గాలి దుమారం, ఆకాల వర్షం భయంతో పచ్చిగా ఉండగానే రైతులు పంటను కోస్తున్నారు. పంట కోసిన కొందరు ధాన్యాన్ని ట్రాక్కుల్లో తరలించి పొలాల్లోని ఎత్తైన ప్రదేశాల్లో, కల్లాల్లో బహిరంగ ప్రాంతాల్లో ఆరబెట్టుకుంటున్నారు. వరి కొనుగోలు కేంద్రాలు ధన్వాడ, మందిపల్లి, కిష్టాపూర్, గోటూర్, కొండాపూర్, హన్మన్‌పల్లి గ్రామాల్లో ప్రారంభించారు. కానీ చాలా వరకు కూలీలు లేకపోవడంతో వరి కొనుగోలు ఒకటి రెండుకు మించి గ్రామాల్లో ప్రారంభించలేదు. దీంతో కోసిన వరి పంటను కొనుగోలు కేంద్రాలకు దగ్గరలోని పొలాల్లో ఆరపెడుతున్నారు. ఆకాశంలో మబ్బులు పట్టిన సమయంలో ధాన్యాన్ని కుప్పలుగా చేసి కవర్లను కప్పుతున్నారు. ఇదురుగాలులకు అవి ఎగిరిపోతూ చిన్నపాటి వర్షానికే తడిసిపోతున్నాయి. కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణ మార్పులు..

ఎండకాలంలో వాతావరణం గతితప్పిందా అన్నట్టుగా పరిస్థితులు మారుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉష్ణోగ్రతలతో భగ్గున మండిపోతుంది. సాయంత్రం 4గంటల నుంచి వాతావరణం మారిపోతుంది. ఈదురు గాలులతో వర్షం పడుతుంతుందా లేదా అని తెలియని పరిస్థితిగా మారుతోంది. కుప్పలుగా పోసిన వరి పంట వద్ద రైతులు ఉదయం, రాత్రి అని తేడాలేకుండా అక్కడే జాగారం చేస్తున్నారు.

మండలంలో 10వేల ఎకరాల్లో వరి సాగు..

మండలంలో 20 గ్రామాల పరిధిలో దాదాపు 10వేల ఎకరాల్లో రైతులు వరి పంటసాగు చేశారు. ప్రస్తుతం ఇప్పటికి 40 శాతం నుంచి 50 శాతం పంట కోత పూర్తయింది. మిగతా పంట కోయాల్సి ఉండగా, ఆకాశంలో మబ్బులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇదే అదునుగా కొంత మంది ప్రైవేట్ బ్రోకర్లు రైతుల వద్ద తేమశాతం తక్కువ ఉన్నా ఇబ్బందులు పడొద్దని, వాతావరణం బాగోలేదని చెప్పి సన్నరకం వరి ధాన్యాన్ని ధరను తగ్గించి రూ.2వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటా ధాన్యానికి రూ.2,320లతో పాటు సన్న రకం వరికి బోనస్ రూ.500 ప్రభుత్వం అందిస్తోంది.

ఈదురు గాలులతో ఆందోళనగా ఉంది



సాయంత్రం నాలుగు దాటితే చాలు ఆకాశంలో వస్తున్న మబ్బులతో ఆందోళన చెందాల్సి వస్తోంది. ఉదయం నుంచి తెల్లవార్లు ఇక్కడే ఉంటున్నాం. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియడంలేదు. వరి కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి.

– లక్ష్మారెడ్డి, గోటూర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట: ప్రజలు సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికాకుండా, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్కెట్‌కి వచ్చి పోయేటప్పుడు ఏమరపాటుగా ఉంటే మనకు తెలియకుండానే దొంగతనాలు చేస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనదారులు మద్యపానం తాగి వాహనాలు నడపరాదన్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను, కూలీలను ఎక్కించుకోరాదన్నారు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంత వరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, పరిమిత వేగంలో వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, మహిళా పోలీసులు అర్చన, శిరీష, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభకు తరలిరావాలి



మరికల్: వరంగల్ సభకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు తరలిరావాలని మాజీ సర్పంచ్ సుజాత, నాయకులు రవి, రఘు, వెంకటస్వామిలు అన్నారు. మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామంలో శుక్రవారం వరంగల్ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే కేసీఆర్ సభకు తరలివెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చిన్నప్‌రెడ్డి, ఆంజనేయులు, హన్మంతు, రాములు, చెన్నయ్యలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో మైనార్టీల నిరసన



మక్తల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

మక్తల్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మక్తల్‌లో శుక్రవారం పెద్ద మసీదు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మైనార్టీలకు కాకుండా ఇతర మతాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రెచ్చగొట్టే విధానాలను మానుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్‌కవి, మౌలానా అలిమ్, రహింపటేల్, ఖాజా షాబుద్దీన్, శంషోద్దీన్, ఫయాజ్, నూరొద్దీన్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



నర్వలో ప్లకార్డులతో నిరసన చేపట్టిన మైనార్టీ నాయకులు

నర్వ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని నర్వ మండల జామ మసీద్ సదర్ సాహెబు హుస్సేన్ అన్నారు. ప్రార్ధన అనంతరం ప్లకార్డులతో చట్టాన్ని రద్దు చేయాలని నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ చట్టాన్ని ముస్లిం సమాజం ఆమోదించదన్నారు. ఈ చట్టాన్ని వెనకకు తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. భవిష్యత్‌లో పోరాటాన్ని గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు చేపడుతామన్నారు. నిరసనలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

'డీఎంహెచ్ఓ అవినీతిపై విచారణ చేయాలి'

నారాయణపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అవినీతి అక్రమాలపై తక్షణమే విచారణ చేసి సస్పెండ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో వైద్య అధికారి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ కింది స్థాయి ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే అనేక మందికి ఫార్మసిస్టులుగా పోస్టింగులు ఇచ్చి ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవినీతి అధికారులకు అధికార పార్టీ నాయకులు అండగా ఉండడం సిగ్గుచేటని తెలిపారు. జిల్లాలోని ఒక హెల్త్ సెంటర్లో ఉన్న ఫార్మసిస్టు తోటి ఉద్యోగిని లైంగికంగా వేధిస్తే చర్యలు తీసుకోవాల్సింది పోయి బెదిరించి కేసు మూసి వేసి, డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం కనీసం దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే డీఎంఎచ్‌ఓపై కలెక్టర్ విచారణ నిర్వహించి సస్పెండ్ చేయకుంటే వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హెల్త్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

దేశ రక్షణలో యువత సేవలు అవసరం



జవాన్‌లను సత్కరించి బహుమతులు అందజేస్తున్న భీమయ్యగౌడ్

దామరగిద్ద: దేశ రక్షణ రంగంలో యువత సేవలు ఎంతో అవసరమని సంజయ్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులు మాజీ సర్పంచ్ భీమయ్యగౌడ్ అన్నారు. ఇండియన్ నేవీ, ఆర్మీలో జవాన్లుగా ఎంపికైన వివిధ గ్రామాల యువకులను శుక్రవారం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో శాలువాతో సత్కరించి లగేజ్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంద్‌నెన్‌పల్లి, బాపన్‌పల్లి, దామరగిద్ద తండా, ముస్తాపేట్ గ్రామాలకు చెందిన యవకులు జవాన్లుగా ఎంపికై దేశ రక్షణ రంగంలో పని చేసేందుకు తరలివెళ్లడం అభినందనీయమన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ఇలాంటి ఆదర్శ వంతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శంభులింగం, శశిధర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ షెట్టి, మహేష్ ఆర్మీకి ఎంపికైన ఆనంద్, రవి కుమార్, వివేక్, శ్రీకాంత్, కృష్ణ, ఉషనప్ప, రఘువర్ధన్, శివ, సిద్దు, యోగేష్, పవన్‌లు పాల్గొన్నారు.

జోరుగా పేకాట.. పట్టించుకోని అధికారులు

మాగనూర్: మండల పరిధిలోని మాగనూర్, మందిపల్లి గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతోందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాలలోని పంటల పొలాల దగ్గర సమీప తోటలలో మైదాన ప్రాంతాలలో మైన ర్లు, యువకులు నిత్యం పేకాట ఆడుతూ.. బానిసలుగా మారుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కొన్ని ఇండ్లలో ఈ పేకాట గుట్టుగా సాగుతోందని తెలుస్తోంది. ఆయా గృహాల యజమానులు వేల రూపాయలు ఆశచూపి పేకాట దంద కొనసాగిస్తున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారులకు ముడుపులు ముడుతున్నందున ఈ పేకాటపై సమాచారం ఉన్న ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు వీహెచ్‌పీ నిరసన ర్యాలీ

నారాయణపేట టౌన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న మారణకాండను వీహెచ్‌పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని నారాయణపేట జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షులు డా.రాంబాబు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బెంగాల్ రాష్ట్రంలో హిందువులకు రక్షణ కల్పించాలని, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. వక్ఫ్ చట్టం పేరుతో హిందువులను అత్యంత దారుణంగా హింసకు గురి చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు వీహెచ్‌పీ పిలుపు నిచ్చిందన్నారు. శనివారం పట్టంలోని మెయిన్‌చౌక్ నుంచి ఉదయం 9గంటలకు పలు హిందూ సంఘాలతో కలిసి కలెక్టరెట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు రాంబాబు తెలిపారు.

ఛత్రపతి శివాజీ నూతన కమిటీ ఎన్నిక

మరికల్: మండలంలోన్ని ఇబ్రహీంపట్నం గ్రామంలో చత్రపతి శివాజీ సేన నూతన కమిటీన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అనిల్‌కుమార్, ఉపాధ్యాక్షులుగా రాము, శివ, ప్రధాన కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా కృష్ణ ప్రసాద్, యువజన క్రీడా వ్యవహారాలుగా శివ, విష్ణులను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో కోయిల్‌కొండ రఘు, రవిచంద్రకుమార్, బాల రాజ్, నాగరాజ్‌లు పాల్గొన్నారు.

జానపద కళలను ఆదరిద్దాం



బిజ్వార్‌లోని అంభత్రయ క్షేత్రంలో మాట్లాడుతున్న స్వామిజీ

ఊట్కూరు: జానపద కళలను ఆదరిద్దామని ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం బిజ్వార్‌లోని అంభత్రయ క్షేత్రంలో జానపద పాటల సీడీని ఆవిష్కరించారు. పులిమామిడి గ్రామానికి చెందిన వెంకట్ జానపద సీడీని విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆదిత్య పరాశ్రీ స్వామి మాట్లాడుతూ జానపద కళలు అంతరించి పోతున్న తరుణంలో చదువుకున్న యువకులు జానపద పాటలను వెలికి తీసి సీడీ రూపంలో అందరికి అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. గతంలో శ్రమ జీవులు, కార్మికులు, కర్షకులు తమ కష్టాన్ని మరిచి పోవడానికి జానపద పాటలను పాడేవారని స్వామిజీ తెలిపారు. జానపద పాటలు, కోలాటం, చెక్క భజన తదితర కళలను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్వామిజీని భక్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు నరహరి, వెంకట్, కృష్ణయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



భూనీడు మెథడిస్టు చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కొత్తపల్లి: మండల పరిధిలోని క్రిష్టియన్ సోదరులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఆయా చర్చిల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని భూనీడు, నిడ్జింత, దుప్పటి గట్టు, కొత్తపల్లి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఏసయ్యను స్మరించుకున్నారు. భూనీడు చర్చిలో పాస్టర్ విజయ్ కుమార్, వంశీలు క్రీస్తును స్మరిస్తూ క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ఏసు క్రీస్తు సిల్వపై పలికిన ఏడు మాటలను ధ్యానంతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాసు, క్రాంతి, రాజు, వెంకట్‌రాములు, మహిళలు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే పీఏకు విన్నవిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట: రైతుల నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారం చేసి, డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న రమేశ్‌గౌడ్ అలియాస్ అప్పిగౌడ్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డికి బీకేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ అలియాస్ అప్పిగౌడ్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన గౌనిగనూర్, నసలై, కుంటిమారి గ్రామాల రైతుల నుంచి మూడేళ్ల క్రితం ధాన్యాన్ని సేకరించి, పది రోజులలో డబ్బులు చెల్లిస్తానని చెప్పారన్నారు. ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని, డబ్బులు చెల్లించాలని వ్యాపారి ఇంటికి ఎన్ని సార్లు వెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల పక్షాన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ఇలాంటి మోసాలు చేస్తున్న వ్యాపారుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని అమ్మే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఇలాంటి మోసాలు జగరకుండా చూడాలన్నారు. మోసం చేసిన వ్యాపారిపై చర్య తీసుకొని రైతులకు న్యాయం చేయాలని భారతీయ కిసాన్ సంఘ నారాయణపేట జిల్లా శాఖ తరపున కోరుతున్నామన్నారు.



ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

అప్పిగౌడ్‌పై చర్యలు తీసుకోండి

ధన్వాడ: దమరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన అప్పిగౌడ్ తమకు డబ్బులు ఇవ్వడం లేదంటు మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కార్తిక్, మొల్లన, కొండప్పలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. 2022లో తాము పండించిన వరి ధాన్యాన్ని అప్పిగౌడ్‌కు అమ్మకం చేశామని, డబ్బులు అడిగితే ఇప్పుడు అప్పుడు అంటూ కాలం వెళ్లదీస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో రహిమన్‌ఖాన్, లక్ష్మారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, సూరిగౌడ్, నసార్, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థులకు ర్యాంకులు



మక్తల్: ఒలంపిక్ ఏఐఎంఎస్ ఒలంపిక్ అకాడమీ పోటీల్లో మక్తల్ పట్టణంలో కేరళ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించారు. అనంత రాణి 8వ ర్యాంకు, ఈసిక స్టేట్ 3వ ర్యాంకు, అక్షిత 5వ ర్యాంకు సాధించారు. పాఠశాలకు జాతీయ స్థాయిలో పేరు తీసుకరావడంతో విద్యార్థులను కరస్పాండెంట్ మీరా, ఉపాధ్యాయులు అభినందించారు.

మే 1 నుంచి క్రీడా శిబిరాలు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. క్రీడాశిబిరాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుదని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఈనెల 22లోపు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గజ్జలమ్మ ఆలయానికి దాతల సాయం

మరికల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గజ్జలమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం దాతలు ఆర్థిక సాయం చేశారని ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణ తెలిపారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్, కొండప్ప, కుర్మన్న, నర్సింహులు, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలమణి

నారాయణ పేట టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలైన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా కార్యకర్తల కార్యవర్గ సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్ని మార్చేసి యజమానులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాటంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మే 20న జరిగే జాతీయ సమ్మెలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరామ్, ఉపాధ్యక్షులు జోషి, నాయకులు మహ్మద్ అలి, యూనియన్ కార్యదర్శి గౌరమ్మ, నేతలు అనురాధ, నర్మద, సాబేర బేగం, పార్వతి, సునిత, లక్ష్మి పలువురు పాల్గొన్నారు.